## సీతారామ ప్రాజెక్టులో భద్రాద్రి జిల్లాకు అన్యాయం

సిపిఐ మండల మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

సెంటర్ స్ప్రెడ్






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 15 | జూలై | 2025

పేజీలు : 8


# తెలంగాణలో పుట్టినందుకు గర్వించేలా కార్యాచరణ



**-మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
**- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**
**-లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ.. మంజూరు పత్రాలు అందజేత**

**ప్రజాపక్షం/ ఖమ్మం/ చింతకాని :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఆత్మ గౌరవంతో జీవిస్తూ ఈ గడ్డపై పుట్టినందుకు గర్వపడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సోమవారం మధిర నియోజక వర్గంలోని చింతకాని మండలంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో విక్రమార్క పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులు అందించడంతో పాటు చింతకాని మండలంలోని

మిగతా 2లో..

## సమస్యల పరిష్కారమే ఎజెండాగా కార్యాచరణ

**-భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు మహాసభలు దోహదపడాలి**
**-సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి పోరాటాలు తప్పవని అందుకు అనుగుణంగా కార్యక్రమాలు తీసుకోవాలని ఆయన సూచించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం తోట రామాంజనేయులు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాగం హేమంతరావు మాట్లాడుతూ పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలే ఎజెండా ప్రభుత్వ కార్యాచరణ రూపొందించడం లేదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి కార్పొరేట్ల మేలు కోరుతూ మాత్రమే పాలన సాగిస్తుందని, రైతులు, కార్మికులు, దిగువ మధ్యతరగతి పేదలకు

మిగతా 2లో..

## కృష్ణా జలాలను వినియోగించుకుందాం



**-పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం : భట్టి విక్రమార్క**
**-సాగర్ ఎడమ కాలువ రెండవ జోన్‌కు నీటిని విడుదల చేసిన మంత్రులు భట్టి, పొంగులేటి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కృష్ణా జలాలను ఒడిసిపట్టి సక్రమంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునే లక్ష్యంతో కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. సోమవారం పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి సాగర్ ఎడమ కాలువ రెండవ జోన్‌కు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో కలిసి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సాగు నీటి తోనే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని

మిగతా 2లో..

## విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ అందని ద్రాక్షేనా..!



**-ప్రశ్నార్థకంగా మారనున్న విద్యార్థుల భవిష్యత్తు**
**-ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడున్నర ఏళ్లుగా రాని ఫీజు రీయంబర్స్‌మెంట్**
**-అప్పుల ఊబిలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం :** ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులు ఉత్తమ విద్యను అందించే లక్ష్యంతో 2004 సంవత్సరం నుంచి అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టి పేద వర్గాల విద్యార్థులందరికీ ఉన్నత విద్యను చేరువ చేశారు. అప్పటి నుంచి ప్రతి యేటా

మిగతా 2లో..

## తెలంగాణలో పుట్టినందుకు
# గర్వించేలా కార్యాచరణ





(మొదటిపేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సభలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదలు ఉండరాదన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టామని రూ. 22వేల కోట్లతో ఈ ఏడాది 4.50 లక్షల ఇండ్లు నిర్మించనున్నామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర నిర్వహించానని ప్రజలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులు చూసి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రత్యేక పథకాలను తీసుకు రావడం జరిగిందన్నారు. 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. రూ. 500 గ్యాస్ సిలెండర్ పై సబ్సిడీ ఇస్తుండగా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. మహిళల కోసం ప్రత్యేక పథకాలను ఏర్పాటు చేసుకున్నామని రూ. 632 కోట్లు ఖర్చు చేసి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని విక్రమార్క తెలిపారు. 104 చోట్ల యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను నిలుపుదల చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే రూ. 21,632 కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందిస్తామని విక్రమార్క స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక చేయూత కోసం సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని మధిర నియోజక వర్గంలో రెండు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేశామన్నారు. విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ముందుకు వస్తే ఎకరాకు ప్రతి ఏడాది రూ. 35వేల కౌలు చెల్లిస్తామన్నారు. మహిళలను భాగస్వాములను చేసి వ్యాపారాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని విక్రమార్క తెలిపారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఒకప్పుడు ప్రైవేటు కంపెనీలకు ఇచ్చేవారని ఇప్పుడు డ్వాక్రా మహిళల ద్వారా ఏకరూప దుస్తులు కుట్టించడం జరుగుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే సమాజం ఆర్థికంగా బలపడుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సెర్ప్ సిఈవో దివ్య మాట్లాడుతూ అందుకున్న విజయాన్ని అందరికి పంచుదామనే నినాదంతో మహిళ సంఘాల్లో నూతన సభ్యులను చేర్చాలని 60 ఏళ్ల దాటిన వారికి ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, డిపివో ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ అందని ద్రాక్షేనా..!

(మొదటిపేజీ తరువాయి)

వేలాది మంది పేద విద్యార్థులు ఒక్క పైసా ఫీజు లేకుండా ఉచితంగా బిటెక్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులలో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కీమ్ ద్వారా విద్యార్థుల ఫీజులను చెల్లించేవిధానంతో విద్యార్థుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. ఫీజు రీయంబర్స్‌మెంట్ వల్ల డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య విద్య, ఇతర ప్రొఫెషనర్ కోర్సులను పూర్తి చేసి వేలాది మంది విద్యార్థులు పలు రకాల ఉన్నత ఉద్యోగాలలో రాణించి ఆర్థిక శక్తిగా ఎదిగారు. తెలంగాణ రాష్ట్రం రాక ముందు ఉమ్మడి రాష్ట్రం ఉన్నంత వరకు ఫీజు రీయంబర్స్‌మెంట్ విధానం సజావుగానే కొనసాగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించే విధానంలో పాలకుల ధ్వందనీతి కారణంగా ఉన్నత విద్యా సంస్థలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రభుత్వాలు విడతల వారీగా విడుదల చేయడంతో ఇటు విద్యార్థులు అటు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడ్డారు. 2020 21 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాని దుస్థితి ఏర్పడడంతో విద్యార్థులు కళాశాల యజమాన్యాలు లబోదిబోమంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఒక్క రూపాయి ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేటు యజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**ఐదు సంవత్సరాలుగా అందని ఫీజు రీయంబర్స్‌మెంట్ :**

ఎస్సి, ఎస్టి, బిసి, ఈబిసి, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు గత మూడున్నర ఏళ్లుగా వేల సంఖ్యలో బిటెక్, డిగ్రీ, విద్య, వైద్య, ప్రొఫెషనల్ కోర్సులను కొనసాగిస్తున్నారు. ఎస్సి, ఎస్టి విద్యార్థులు చదివే ఇంజనీరింగ్ కళాశాలలకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాల్సి ఉంది. బిసి, ఈబిసిలకు ప్రభుత్వం నుంచి ఒక్కో విద్యార్థికి రూ. 35వేల ఫీజు రీయంబర్స్‌మెంట్, మైనార్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాల్సి ఉంది. డిగ్రీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 18వేల నుంచి రూ. 30వేల వరకు అందించాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు చదువుతున్నారు. వారికి గత ప్రభుత్వాల బకాయి ప్రస్తుత ప్రభుత్వ బకాయి కలిసి సుమారు రూ. 8,158 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ప్రైవేటు కళాశాలల్లో విద్యా సంస్థలు విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు చెల్లించడం లేదనే సాకుతో విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

**అప్పుల ఊబిలో ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు :**

ప్రభుత్వం నుంచి సుమారు ఐదు సంవత్సరాలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్ రాకపోవడంతో ప్రైవేటు డిగ్రీ, బిటెక్, ప్రొఫెషనల్ కోర్సుల కళాశాలల నిర్వాహకులు పీకల లోతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కళాశాలల బోధన, బోధనేతర సిబ్బంది నెలవారీ జీతాలు, కళాశాలల బస్సుల నిర్వహణ, ల్యాబుల నిర్వహణ, ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లు, కళాశాల డెవలప్‌మెంట్ యాక్టివిటిస్ నిర్వహణ, కళాశాల అనుబంధ హాస్టళ్ల నిర్వహణ తదితర అన్ని ఖర్చులు ఒక్కో కళాశాలకు కోట్ల రూపాయలలో ఒక ఏడాదికి ఖర్చు అవుతుంది. సుమారు ఐదేండ్లుగా కోట్లలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన యాజమాన్యాలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం విద్య పట్ల అంతులేని నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించడంతో అటు విద్యార్థులు ఇటు కళాశాల నిర్వాహకులు కుంగుబాటుకు గురవుతున్నారు. ఇప్పటికే ఆర్థికంగా కుంగిపోయి కొన్ని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలు మూతపడ్డాయి. మరికొన్ని కళాశాలలు దిన దినగండం నూరేళ్ల ఆయుష్షులా నత్తనడకతో ముందుకు సాగుసాగుతున్నాయి.

**ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోతే ఆందోళన తప్పదు : ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ**



తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ తక్షణమే చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు.

## సమస్యల పరిష్కారమే
# ఎజెండాగా కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి ఏ సానుకూల నిర్ణయం కేంద్ర ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పాట పాడుతున్నా వాస్తవ లబ్దిదారులను సంతృప్తి పర్చలేకపోతుందని హేమంతరావు తెలిపారు. రుణమాఫీ విషయంలో రైతులను సంతృప్తి పర్చలేకపోయిందని ఇప్పటికైనా రెండు లక్షల పైబడి రైతులకు సంబంధించి రుణమాఫీని అమలు చేయడంతో పాటు రైతుబీమా, పంటల బీమా పథకాన్ని ఈ ఏడాది నుంచే అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లుగా ఆరు హామీలను అమలు చేసేందుకు సిద్ధం కావాలని ఆయన కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమ నేపథ్యంలోనే 100 ఏళ్లు పూర్తి చేసుకుంటుందని ఈ సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. మహాసభల సంవత్సరం సందర్భంగా గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుగుతున్నాయని ఈ క్రమంలో ఈనెల 19, 20 తేదీల్లో మధిరలో ఖమ్మంజిల్లా 23వ మహాసభలు జరగనున్నాయన్నారు. ఈ మహాసభల్లో జిల్లాలో ఉన్న వనరుల వినియోగం, ప్రజా సమస్యలు, పార్టీ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేయాలని అందుకు అనుగుణంగా పోరాటాలు నిర్వహించాలని హేమంతరావు తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ 600 మంది ప్రతినిధులు జిల్లా మహాసభకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా పాల్గొంటారని సురేష్ తెలిపారు. కార్యవర్గ సమావేశంలో మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి పాల్గొన్నారు.

## కృష్ణా జలాలను
# వినియోగించుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన సూచించారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని విడుదల చేస్తున్నామన్నారు. గతేడాది సెప్టెంబర్ మాసంలో వచ్చిన భారీ వరదల కారణంగా పాలేరు ప్రాజెక్టు దిగువన సాగర్ కాలువ కొట్టుకుపోయింది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేసి సాగునీటిని అందించిన ఆ తర్వాత ఇప్పుడు శాశ్వత మరమ్మతులు చేసి దాదాపు 14.20 లక్షల రూపాయలతో అండర్ టన్నెల్ సహా కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయల్ సాగర్, పాలమూరు, రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు నారాయణపేట, కోడంగల్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామన్నారు. రైతులకు సాగునీటిని అందించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని కూడా అందిస్తుందని ఆయన తెలిపారు. రైతులకు ఆర్థిక చేయూతనివ్వడంతో పాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మన రాష్ట్రం అన్నపూర్ణగా, విత్తన భాండాగారంగా మారిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువ పరిధి రెండవ జోన్‌లోని రెండున్నర లక్షల ఎకరాలకు నాగార్జున సాగర్ నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని క్రమ పద్ధతిలో పెంచుతూ ఐదారు రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిని కాలువకు విడుదల చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ క్రమంలోనే తొమ్మిది వేల కోట్ల రూపాయల రైతు భరోసా ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. సన్న వడ్లకు కూడా బోనస్ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్ పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రానికి చక్కటి ఆధరణ

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రానికి చక్కటి ఆధరణ లభిస్తోంది. ఈ సెంటర్‌లో ఆధార్ మార్పులు చేర్పులు చేసుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆధార్ కేంద్రాన్ని ఆర్డిఓ దామోదర్ రావు ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఆధార్ కేంద్రంలో ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. తొలిరోజు సుమారు 600మందికి పైగా హాజరు కాగా సుమారు 300 మందికిపైగా ఆధార్ కార్డుల సవరణ రిజిస్ట్రేస్లు నమోదు చేయించుకున్నారు. దుమ్ముగూడెం, చర్ల , బూర్గంపాడు మండలాల నుండి ప్రజలు తరలిరావటంతో ఏడు ఆధార్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రజలు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా మెడికల్ క్యాంపు, మంచినీరు వంటి సదుపాయాలు చేసిశారు. ఈ కార్యక్రమంలో డిటి డానియేల్ వెంకటేశ్వరరావు,చర్ల డిటి రాజు, నాలుగు మండలాల ఆర్ఐలు, ఆర్‌డిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్ర.జూ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి




**ప్రజాపం/భద్రాచలం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల సౌకర్యార్థం మధ్యా హ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు కొప్పుల రవీంధర్ అన్నారు. సోమవారం కాలేజీని సందర్శించిన ఆయనకు విద్యార్థులు పలు సమస్యలు చెప్పారు. ఈ సందర్భంగా రవీంధర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం లేకపోవడం వల్ల పేద విద్యార్థుల కు ఇబ్బందిగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చదువులకు దూరంకాక ముందే ఈ సమస్యలను తీర్చి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, పవన్, కళ్యాణ్, గీత, అమూల్య, అనిత, స్వరూప, సురేష్ తతదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సింగరేణి మండలం గుడితండాకు చెందిన కొత్తూరు వీరమ్మ తనకు స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో ఇంటి స్థలం కేటాయించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం జెడ్పి కాలనీకి చెందిన సరికొండ జానకి రామ రాజు తన ఇంటి నెంబర్‌పై వేరే వారి పేరు వస్తుందని తమ పేరు వచ్చే విధంగా చూడాలని దరఖాస్తు చేశారు. సింగరేణి మండలం చీమలపాడుకు చెందిన తాటి అనంతరాములు సర్వే నెం. 154/2 నందు గల భూమి పూర్తి సర్వే చేసి తన పేరు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం వైఎస్ఆర్ నగర్ కాలనీకి చెందిన బి. ప్రవళిక డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. మధిర మండలం సిరిపురం గ్రామ ఎస్సి కాలనీవాసి స్మశాన వాటిక ఆక్రమణకు గురైందని అక్రమంగా రేకుల షెడ్డు వేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె. శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో మహిళ మృతి

**- మృతదేహంతో సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్తుల ధర్నా**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో విషాదకరమైన ఘటన చోటు చేసుకుంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. యమపాశాలాంటి తీగలపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఓ కుటుంబానికి తీరని విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. కస్నాతండాకు చెందిన మారుతి ముత్తమ్మ(45) అనే వివాహిత సోమవారం ఉదయం బట్టలను ఇంటిపైన ఆరబెడుతుంది. ఈ క్రమంలో ఇంటిపైనే ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్‌లైన్ తీగలకు తడి బట్టలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటగా..గ్రామస్థుల ఆగ్రహం పెల్లుబీకింది.

**సబ్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా, దాడి...**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహించిన గ్రామస్థులు, అఖిలపక్ష నాయకులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పల్లెగూడెం సబ్‌స్టేషన్ ఎదుట గల ఖమ్మం, మహబూబాద్ జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి ధర్నా చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, తక్షణమే ఏడీ, ఏఈపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఎర్రటి ఎండలో గంటకుపైగా ధర్నా చేస్తున్నప్పటికీ విద్యుత్‌శాఖ పట్టించుకోకపోవడంపై ఆందోళనకారులు రగిలిపోయారు. సబ్‌స్టేషన్‌పై దాడి చేసి తలుపులు ధ్వసం చేశారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు.


**ఏసీపీ తిరుపతిరెడ్డి సూచనలతో కొలిక్కి...**

ఎట్టకేలకు ధర్నా ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదేశాలతో కొలిక్కి వచ్చింది. అఖిలపక్షం నాయకులు, అధికారులతో ప్రశాంత వాతావరణంలో చర్చించుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్వో పిల్లి రాంప్రసాద్, ఏడీ రామకృష్ణ, ఏఈ జిల్లా ప్రభాకర్‌రావుతో అఖిలపక్షం నాయకులు చర్చించారు. ఈ నేపథ్యంలో చర్చలు ఫలించడంతో పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో వివాదం ముగిసింది.

**పోలీసుల వైఫల్యంతో సబ్‌స్టేషన్‌పై దాడి...**


విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఉదయం చోటు చేసుకుంది. దీనిపై గ్రామస్థుల ఆగ్రహంగా ఉన్నరన్న సంగతి సామాజిక మాద్యమాలలో వచ్చిన వీడియోల ద్వారా కనిపిస్తునే ఉంది. పోలీసులకు ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ అక్కడే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తునే ఉన్నారు. అయినప్పటికీ పోలీసులు అక్కడికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేయకపోగా...అలానే వదిలేశారు. ఈ క్రమంలో గ్రామస్థులు ట్రాక్టర్ ద్వారా మృతదేహాన్ని సబ్‌స్టేషన్ వద్దకు తీసుకువచ్చి ధర్నాకు దిగారు. అలాగే సబ్‌స్టేషన్‌పై దాడి చేసి ధ్వంసం చేశారు. అక్కడ ఉన్న కొందరు పోలీసులు పరిస్థితిని చక్కదిద్దకపోగా...మమ అన్నట్టుగా ఉండిపోయారు. ఈ నేపథ్యంలోనే పరిస్థితి తీవ్రరూపం దాల్చినట్టుగా స్పష్టంగా కనిపించింది.

# ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ నగర పాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 14వ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న డబ్ల్యూఎంఎం రోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ బృందం తనిఖీ చేసింది. సర్దార్ పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ షెడ్డు నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. పదవ డివిజన్‌లో సిసి రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. 14వ డివిజన్ గొల్లగూడెం నర్సరీ, ఈద్గా పార్కును ఉద్యానవన శాఖాధికారి రాధిక పరిశీలించి మొక్కల పరిరక్షణ, పారిశుధ్యంపై సమీక్షించారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా పలు డివిజన్లలో రోడ్లు, డ్రైన్లు శుభ్రపరిచారు. చెత్తను తొలగించి మొక్కలు నాటారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డు ఆఫీసర్లకు ట్రేడ్ లెసెన్స్‌లపై అవగాహన కోసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ పాల్గొని ట్రేడ్ లెసెన్స్‌ల ప్రాధాన్యత, విధి విధానాలు, అనుమతులు తదితర అంశాల గురించి వివరించారు.

# అర్థశాస్త్రంలో పిజి కళాశాల విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పిజి కళాశాల అర్థశాస్త్ర విభాగంలో 13 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ రవి కుమార్ మాట్లాడుతూ 2016 నుంచి 2021 విద్యా సంవత్సరంలో వీరు యూనివర్సిటీ టాపర్లుగా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. ఇటీవల కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాలు పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. నంద్రు బాబురావు, ఎస్‌కె బాజీ, నర్సింహారావు, అశోక్, కాంచన, కావ్య, రమ్య, హతిరామ్ నాయక్, నాగార్జున, దీప్తి, ఉమా బంగారు పతకాలను సాధించారన్నారు. ఈ సందర్బంగా విద్యార్థులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి డా॥ మోదుగు శ్యాంబాబు, అధ్యాపకులు డా॥ తడికమళ్ల శేఖర్, డా॥ జగ్జీవన్ రావు, డా॥ చలపతి రావు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టూ వీలర్ మెకానిక్ కుటుంబానికి ఖమ్మం జిల్లా టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ తరుపున ఆర్థిక సాయం అందించారు. ఖమ్మం నగరానికి చెందిన టూ వీలర్ మెకానిక్ బుజ్జి నవీన్ గత ఏడేళ్లుగా మండే నర్సింహారావు వద్ద వర్కర్ గా పని చేస్తున్నాడు. ఇటీవల పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా దానవాయిగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని ఖమ్మం నగర మెకానిక్ సోదరులు రూ. 30వేలు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాఫర్ రూ. 10వేలు మొత్తం రూ. 40వేలను సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో నవీన్ కుటుంబానికి అందజేశారు. ఈసందర్బంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ యూనియన్‌లో సభ్యత్వం కలిగిన ప్రతి మెకానిక్ సోదరునికి యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లింగనబోయిన మురళి, కోశాధికారి బల్లి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, మండే శ్రీనివాసరావు, గౌరీ ప్రసాద్, అన్నదేవర భద్రయ్య, ఉపేందర్, దేవేందర్, కుమార్, రబ్బాన్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్‌కు కల్లుగీత కార్మికుల సంఘం వినతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంనగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండం కురుణాకర్, సంఘం నాయకులు బోనెపల్లి సంగయ్య, గడ్డమీది వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి ఉపేందర్, మంగూరు ముత్తయ్య, మొక్క నాగేశ్వరరావు, వంగ పవన్, కోటగిరి మల్లయ్య, సైదులు, మధు, రంగయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

# ఇరుకుళ్ళ అనంతలక్ష్మీకి నివాళి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు ఇరుకుళ్ళ లక్ష్మీ నర్సింహారావు భార్య ఇరుకుళ్ళ అనంతలక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. సోమవారం ఆమె భౌతికకాయాన్ని మాజీ జెడ్పిచైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగా ల కమల్‌రాజు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు యన్నంశెట్టి అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కపిలవాయి జగన్మోహన్‌రావు, దోకుపర్తి సత్యంబాబు, ఆళ్ల నాగబాబు, పరిశ శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, చంటి, నాగులవంచ రామారావు, లంకెమళ్ల నాగేశ్వరరావు, ఆరుద్ర కొండ, ఆవుల గోపి, కోట కోటేశ్వరరావు, చలువాది కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** తెలంగాణ ఉపముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క సౌజన్యంతో మధిర మండలం రొంపిమళ్ళ గ్రామంలో మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే పేదవాడి సొంతింటి కల సాకారమైందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కోట్ల రూపాయల నిధులు మంజూరుచేసి మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న భట్టివిక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఎఇ అక్తర్, ఎఎంసి డైరెక్టర్ అద్దంకి రవికుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ దుంప వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి రామారావు, నిడమనూరు వంశీకృష్ణ, ఆవుల కిరణ్, గొల్లమందల శ్రీనివాసరావు, షేక్.మదార్‌సాహెబ్, గూడూరు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడ సత్యంకు సిపిఐ నాయకుల నివాళి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం చిక్కుడు గుంట గ్రామస్తులు సిపిఐ సీనియర్ నాయకులు మేడ సత్యం దశదినకర్మ సోమవారం ఆయన స్వగృహంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ తదితరులు హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## వన మహోత్సవం, సైకిళ్ల పంపిణీ




ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం ఐటిసి ద్వారా సైకిళ్ళు పంపిణీ కార్యక్రమంలో సైకిళ్ళను విద్యార్థినీలకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వనాలు పెంచే ఉద్దేశం తో సమూహంగా అధిక సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని, మానవుని మనుగడకు అవసరమైన వాటిలో అతి ముఖ్యమైనవి చెట్లు అని, చెట్ల యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అదే విధంగా ఐటిసి కంపెనీ ద్వారా అశ్వాపురం మండలంలోని అన్ని పాఠశాలల్లో గిరిజన విద్యార్థినీలు ఎవరైతే ఉన్నారో వారికి సైకిళ్ళు బహుకరించడం చాలా సంతోషకరమైన విషయమని, విద్యనభ్యసించే విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా పాఠశాలలో ఉంటే వారికి కావాల్సిన మౌలిక వస్తువులను ఈ విధంగా సహాయ రూపంలో చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఆర్వో మణిధర్, ఎంపీవో ముత్యాలరావు, ఎంఈవో వీరస్వామి, ఎఫ్ఆర్వో రమేష్, ప్యాక్స్ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు యోగిత వేణి, అశ్వాపురం మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, ఉపాధ్యాయులు, మండల ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## కల్లూరి లక్ష్మీనారాయణకు నివాళి



ప్రజాపక్షం/అశ్వాపురం: మండల పరిధి లోని చింతిర్యాల మాజీ సర్పంచ్ కల్లూరి లక్ష్మీ నారాయణ అనారోగ్యంతో ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి స్వగ్రామానికి బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు వెళ్లి వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న అశోక్‌కుమార్, మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డి, పిట్టా శ్రీను, ముత్యాల నరసింహారావు, తాటి నరేష్, చల్లా కిరణ్, కట్టాం నాగేంద్ర, కుర్సం రామారావు, తాటి రమేష్ పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి



ప్రజాపక్షం/ఇల్లందు: సిపిఐ ఇల్లందు మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం 21 ఏరియాలోని కొవ్వూరి రాయలింగు సభలో సిపిఐ 19వ మండల మహాసభను నిర్వహించారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి సత్యనారాయణ ను ఎన్నుకున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాష తెలిపారు. సహాయ కార్యదర్శులుగా బసిపాక రవి, ఆకుల చంద్రరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిత్యం పోరాటం చేస్తామని, సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాల లను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు సూచించారు. మండలం లోని అప్పలనరసింహపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన సాయి మాధవ్, లీలా లు బ్యాగ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేస్తుందని అన్నారు. ప్రవేట్ కు దీటుగా ఫలితాలు అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు బాగు కోసం స్థానికులు సహాయ సహకారాలు అందించటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రవేట్ పాఠశాలల కన్నా... ప్రభుత్వ పాఠశాలలే మిన్న అనే నినాదాం ను ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. 50 మంది విద్యార్థులకు బ్యాగ్ లు అందించిన దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య, మాజీ సర్పంచ్ మన్నె నగేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఎన్.వి.ఎల్.భవాని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ లూర్దుమేరీ, గ్రామ పెద్దలు బండెల ప్రసాద్, వీరబాబు, శ్రీనివాసరావు, శేషయ్య, భాస్కర్రావు, గోవిందరావు, ఉపాధ్యాయులు కిషన్ నాయక్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# లారీలకు (బాడీ బండ్లు) లోడింగ్ ఇవ్వాలి

**క్వాలిటీ బొగ్గును అందించాలి : సిపిఐ డిమాండ్**



ప్రజాపక్షం/మణుగూరు: లారీలు (బాడీబండ్ల)కు లోడింగ్ ఇవ్వాలని, బొగ్గు క్వాలిటీ లేక వచ్చినటువంటి పర్మిట్లు వెనక్కి వెళ్ళిపోతున్నాయని కాబట్టి సింగరేణి సంస్థ క్వాలిటీ బొగ్గును ఇవ్వాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల జక్కుల రాజబాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మిడిదొడ్ల నాగేశ్వరరావు లు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ గత నెల 2 నెలలుగా బాడీ బండ్లకు లోడింగ్ ఇవ్వడం లేదని, దీని వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సింగరేణి సంస్థ వారు లోడింగ్ తో పాటు క్వాలిటీ బొగ్గు ఇవ్వడంలేదని, క్వాలిటీ బొగ్గు ఇవ్వకపోవడం వలన ఉన్నటువంటి పరిమిట్లు వెనక్కి వెళ్ళిపోతున్నాయని, గత 2 నెలల నుంచి బాడీ బండ్లకు లోడింగ్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఫైనాన్స ద్వారా నడిపించుకుంటున్నటువంటి వీరికి లోడింగ్ ఇవ్వకపోవడం వల్ల ఒకవైపు కిస్తీలు కట్టలేక, టాక్సీలు కట్టలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున సింగరేణి సంస్థ వారు వారికి ఇచ్చినటువంటి మాటను నిలుపుకోవాలని, క్వాలిటీతో కూడినటువంటి బొగ్గును సప్లై చేయాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ కొరకు భూములు, ఇల్లులు త్యాగం చేసి సింగరేణి అభివృద్ధి కొరకు సిపిఐ ఎనలేని కృషి చేసిందని, అనేక మంది భూ నిర్వాసితులను ఒప్పించి తమ ఆస్తులను, ఇల్లులను భూములను, సర్వస్వం త్యాగం చేసి, సింగరేణి సంస్థలు సహకరించారని దీనిని సింగరేణి సంస్థ మరువ కూడదని వారన్నారు. సింగరేణి సంస్థ వారు లారీలు కొనుక్కున్నటువంటి వారికి లోడింగ్ ఇస్తామని, ఆనాడు సింగరేణి సంస్థ ప్రోత్సహించిందని దాని ప్రకారం సుమారు 800 మందివరకు లారీలు కొనుక్కొని లారీ ఓనర్లు అయ్యారని, కొన్ని సంవత్సరాలు మంచిగానే లోడింగ్ ఇచ్చిన సింగరేణి తర్వాత క్వాలిటీ తగ్గించడంతో లోడింగ్ ఇవ్వకపోవడం వలన అనేక మంది లారీ ఓనర్లు లోన్లు ద్వారా తీసుకున్నటువంటి బకాయిలు చెల్లించలేక, అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం, ఫైనాన్స్ కట్టలేనివారు కొంత మంది లారీలు సంస్థ వారు తీసుకెళ్లడం జరిగిందని, అప్పులు కట్టలేక లారీలను అమ్ముకోవడం జరిగిందని ఎనిమిది వందల లారీలు ఉన్నటువంటి ఈ సంస్థ నేడు కేవలం 250 బాడీ బండ్ల తో నడుస్తుందని, ఈ బాడీ బండ్లకు కూడా గత 2 నెలలుగా లోడింగ్ ఇవ్వకపోవడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీని మీద ఆధారపడినటువంటి అనేకమంది లారీ ఓనర్లు, క్లీనర్లు ,గుమస్తాలు బోగుముతా సంఘం, ఎలక్ట్రీషన్లు, టైర్ల షాపు, ఇలా సుమారు ప్రత్యక్షంగా, పరోక్షంగా 5000 మంది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని , దీనిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి సంస్థ జిఎం లారీ ఓనర్స్ (బాడీ బండ్లకు) క్వాలిటీ లోడింగ్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లోడింగ్ లేక ఉన్న లారీలను రోడ్డు మీద పెట్టుకుంటే పోలీసు వారు కూడా ఫైన్లు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాల సత్యనారాయణ, కార్యదర్శి మేరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఆడప స్వామి, లోడింగ్ ఇంచార్జ్ తూపుడి గోవిందు, కోశాధికారి, పెన్నపురెడ్డి జయపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శి కుమ్మరకుంట్ల వెంకట స్వాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జుమ్మారి వెంకన్న, బాబు, భానోత్ భాస్కర్, ఎం శ్రీనివాస్, ఎండి గౌస్, ఉప్పలయ్య, రమేష్ తదితరులు, లారీ ఓనర్లు పాల్గొన్నారు.

# మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడితే ఊరుకోం



ప్రజాపక్షం/ఇల్లందు: బీసీల రిజర్వేషన్ల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న భారత రాష్ట్ర సమితి శాసనమండలి సభ్యులు, జాగృతి వ్యవస్థాపక సభ్యురాలు కల్వకుంట్ల కవిత పై చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తు సోమవారం భారత రాష్ట్ర సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ వారి కార్యాలయం నందు భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులతో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ మాట్లాడుతూఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి తీరుతామని ప్రకటించి గద్దెనెక్కిన తర్వాత, ఇచ్చిన హామీ కోసం నెరవేర్చడం కోసం భారత రాష్ట్ర సమితి శాసనమండలి సభ్యులు, జాగృతి వ్యవస్థాపక సభ్యులు కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో బీసీ సదస్సులు, ధర్నాలు, దీక్షలు చేపడుతూ ఢిల్లీలో కూడా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పైఒత్తిడితో తలొంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆమోదాన్ని హర్షిస్తూ జాగృతి ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత సంబరాలు జరుపుకుంటుంటే ఆ సంబరాలను హేళన చేస్తూ ఎమ్మెల్సీ కవిత పై తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు మహిళలను కించపరిచే విధంగా ఉన్నాయని ఇంతటి దిగజారుడు నీచమైన మాటలను బహిరంగ సభలలో ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్లన్న బే షరతుగా ఆమెకు క్షమాపణలు చెప్పేదాకా ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ రంగనాథ్, ఇల్లందు మండల మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ అజ్మీర్ భావ్ సింగ్ నాయక్, ఇల్లందు పట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, పార్టీ ఇల్లందు నియోజకవర్గ సోషల్ మీడియా, యువజన విభాగం గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, కాసాని హరి ప్రసాద్, పట్టణ నాయకులు కడగంచి వీరస్వామి, నారపాక వసంతరావు, ఇల్లందు మండల, పట్టణ యువజన నాయకులు భూక్య సురేష్, లలిత్ కుమార్ పాసి, ములుగుండ ఉపేందర్ రావు, రామ్ లాల్ పాసి, సుందరగిరి శీను, కిషన్ పాసి, బజారు సత్యనారాయణ, పరకపల్లి రవి, ఎండి గౌస్, నారపకాయ యాకయ్య తదితరులు పాల్గొన్నారు

# సిపిఐని బలోపేతం చేద్దాం

**-అనునిత్యం ప్రజా శ్రేయస్సు కై పోరాటం**
**-ఏఐటియుసి జిల్లా కార్యదర్శి గెద్దాడ నగేష్**



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం పట్టణంలోని 30 డివిజన్ నందు సోమవారం నాడు సిపిఐ పార్టీ శాఖ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు మాజీ కౌన్సిలర్ కళ్యాణి అధ్యక్షతన వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గెద్దాడ నగేష్ పాల్గొని ఆయన మాట్లాడుతూ. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెంలో సిపిఐ పార్టీ అనేక పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రజా శ్రేయస్సు ముఖ్యమని పోరాడే జెండా సిపిఐ దేనని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఏ ఎన్నికల ల్లో నైనా సిపిఐ పార్టీ సత్తా చాటుతూనే వస్తుందన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కూనమనేని గెలుపులోను కొత్తగూడెం నియోజకవర్గ ఓటర్ల పాత్ర ఘననీయమైనదని కొనియాడారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో సిపిఐ పార్టీ నిరుపేదల పక్షాన నిలబడి వేల మందికి ఇళ్ల స్థలాలను పంచిన ఘనత ఉన్నదన్నారు. కార్మిక హక్కుల చట్టాలను కాపాడుతూ ఎల్లవేళలా కార్మిక శ్రేయస్సు ముఖ్యమని భావిస్తూ పనిచే బలమైన నాయకత్వాన్ని కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన మరోసారి గణ స్వరంతో చెప్పసాగారు. నూతనంగా ఎన్నికైన శాఖ సభ్యులకు నాణ్యమైన రాజకీయ సలహాలను అందించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా నూతన శాఖ కమిటీని ఏర్పాటు చేశారు. శాఖ కార్యదర్శిగా గుమ్మడవెల్లి దుర్గారావు, సహాయ కార్యదర్శులుగా అమన్, స్వర్ణలత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఓర్సు మల్లయ్య లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ మాచర్ల శ్రీనివాస్, పోతు పురుషోత్తం, చారి నేరెళ్ల రమేష్, ఈశ్వర్, పోలిశెట్టి రమేష్, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టులో భద్రాద్రి జిల్లాకు అన్యాయం




ప్రజాపక్షం/ఇల్లందు: సీతారామ ప్రాజెక్టు లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అన్యాయం జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్. కె. సాబీర్ పాషా అన్నారు. సోమవారం 21 ఏరియా లోని కొవ్వూరి రాయలింగు సభా ప్రాంగణంలో జరిగిన 19వ సిపిఐ మండల మహాసభలో ఎస్. కె. సాబీర్ పాషా మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు రీ డిజైన్ ద్వారా ఇల్లందు, డోర్నకల్ మహబూబాబాద్, పినపాక నియోజకవర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో సిపిఐ పాత్ర ఎంతో ఉందన్నారు. డిసెంబర్ 26న సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందన్నారు. 21 ఏరియాకి సిపిఐ కి కంచుకోట లాంటిదని, ఎంతోమంది సిపిఐ నాయకులు 21 ఏరియా తయారుచేసిందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలకు అన్యాయం చేయడానికి చూస్తుందన్నారు. అఖిలపక్ష నాయకులు జులై 9న జరిగిన దేశ వ్యాప్త సమ్మెలో 25 కోట్లకు పైగా సంఘటిత, అసంఘటిత కార్మికులు రోడ్లపైకి రావడంతో బిజెపి ప్రభుత్వం భయాందోళనకు గురైందన్నారు. సమ్మెలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికునికి ధన్యవాదాలు తెలిపారు. బిజెపి ప్రభుత్వంలో ప్రజలు వాడే నిత్యవసర సరుకుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు బాగా పెరిగాయి అన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీలకు కట్టబెట్టి ప్రైవేటుపరం చేయడానికి బిజెపి ప్రభుత్వం చూస్తుందన్నారు. దేశంలో 37% ఓట్లతో గెలిచిన బిజెపి ప్రభుత్వం, కార్మిక సంఘాలకు 51% మద్దతు ఉంటేనే కొనసాగుతాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసి ప్రజలు రెండు వేల మందికి పైగా బిజెపి దహన కాండకు మృతి చెందారన్నారు. 2026 మార్చి లోపు మావోయిస్టులను అంతం చేయడం కాదు, 2026 లోపు దేశంలో విద్య, వైద్యం, రైతుల గిట్టుబాటు ధర అందించాలన్నారు. మణుగూరు ఏరియాలో ఓసి నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చిన విధంగానే పూసపల్లి ఓసి లో నిర్వాసిత ప్రాంతాలైన 21 ఏరియా, పూసపెల్లి, తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్, 24 ఏరియా వాసులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలని, 2019 సింగరేణి చట్టం అమలు చేయాలని కోరారు. లేదంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో సింగరేణి నిర్వాసిత ప్రాంత ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఇల్లందును రెవెన్యూ డివిజన్ గా, బోడు, కొమరారం మండలాలను ఏర్పాటు చేయాలన్నారు. సిపిఐ అధికార పార్టీతో కలిసి ఉన్న ప్రజలు ఎదుర్కొనే ప్రజా సమస్యల పై నిత్యం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మిర్యాల రంగయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, సిపిఐ పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాస్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బంధం నాగయ్య, ఇల్లందు పట్టణ మహిళ కార్యదర్శి కమటం చంద్రకళ, ఇల్లందు మండల మహిళా కార్యదర్శి తడికల శ్రీలక్ష్మి , ఉడుత ఐలయ్య, వడ్ల శీను, సుందర్, మంచాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన స్కూల్ ఫీజులను వెంటనే తగ్గించాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: భద్రాచలం పబ్లిక్ స్కూల్ నందు పెంచిన స్కూల్ ఫీజులను తగ్గించాలని కోరుతూ ఐఎన్‌టియుసి మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఐటిసి పిఎస్‌పిడి ప్రధాన గేట్ వద్ద మీటింగ్‌లో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి మిత్రపక్షాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డిలు మాట్లాడుతూ వెల్ఫేర్‌లో భాగమైనటువంటి స్కూల్‌ని కూడా ఇప్పుడు ఉన్నటువంటి గుర్తింపు సంఘం యాజమాన్యం కలిసి కార్పొరేట్ విద్యాసంస్థగా మార్చారని, గతంలో ఎన్నడూ లేని విధంగా హద్దు అదుపు లేకుండా స్కూల్ ఫీజులు పెంచుతూ కార్మికుల్ని ఆర్థికంగా నష్టపరుస్తున్నారని అన్నారు. అదే విధంగా పిపి1 పిల్లలకు రెడ్డిపాలెం, బూర్గంపాడు మీదుగా స్కూల్ బస్సు నడపాలన్నారు. బిపి స్కూల్‌లో టెన్త్ క్లాస్ వరకు చదివిన పిల్లలకు ఇదే కాలేజీలో జాయిన్ అయితే అడ్మిషన్ ఫీజు తీసుకొనరాదని అదనంగా ఇంకొక స్కూల్ బస్సును ఏర్పాటు చేయాలన్నారు. 13వ ఎల్‌టీపీ రాసుకొని ఇప్పటికీ పరిష్కారం కానీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మీటింగ్ అనంతరం యాజమాన్యానికి అందజేశారు. అదే విధంగా బదిలీ కార్మికుని సర్వీస్‌ని కూడా గ్రాట్యూటీగా లెక్కించేయవలసిందిగా యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. మొన్న రిటైర్డ్ అయిన కార్మికునికి ఎంత వరకు గ్రాడ్యూటీ లెక్కించలేదని త్వరగా లెక్కించి చెల్లించాలన్నారు. దీని వలన భవిష్యత్తులో కూడా వందల మంది కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టియుసి మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, బదిలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నీలగిరి కొండల్లో ఎకోటూరిజం ఏర్పాటుకు ప్రయత్నాలు

**అటవీ కార్పొరేషన్ సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సునీత ఎం భగవత్..**



ప్రజాపక్షం/సత్తుపల్లి: ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలంలోని కనిగిరి గుట్టల్లో ఎకో టూరిజం ఏర్పాటు చేసే ఆలోచనతో సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు అటవీ కార్పొరేషన్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సునీత ఎం భగవత్ తెలిపారు. సోమవారం సత్తుపల్లి డివిజన్ పర్యటనకు వచ్చిన సునితా ఎం భగవత్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 1783 హెక్టార్లలో, రూ. 80 కోట్ల ఖర్చుతో కొత్త నర్సరీల ఏర్పాటుకు ప్రయత్నాలు నడుస్తున్నాయని, వాటిలో శ్రీగందం, సీతాఫలం,ఎర్రచందనం తదితర లాభదాయకమైన మొక్కల పెంపకంకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని పలు నర్సరీలో శ్రీగందం, ఎర్రచందనం, సబ్బుల తయారీలో ఉపయోగించే (సోప్ నట్స్ ) మొక్కల పెంపకం ఇప్పటికే ప్రారంభమైనట్లు ఆమె తెలిపారు. ఉత్పత్తి, డిమాండ్ ఆధారంగా కొత్త నర్సరీల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది ఎకో టూరిజం, బ్యాంబు, యూకలిప్టస్, జీడి మామిడి తదితరాల విక్రయాలు ద్వారా రూ. 310 కోట్ల ఆదాయం కార్పొరేషన్ కు లభించిందన్నారు. లాభదాయకంగా ఉంటేనే ఆ వైపు దృష్టి సారిస్తామన్నారు. ప్రస్తుతం బ్యాంబు, యూకలిప్టస్, జీడిమామిడి మాత్రమే కార్పొరేషన్ స్థలాల్లో పెంపకం జరుగుతుందని, కొత్త నర్సరీల ద్వారా ఆదాయం లభించే కొత్త మొక్కల పెంపకం జరగబోతుందన్నారు. దీంతో పాటు కార్పొరేషన్ అడవులు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో టూరిజం డెవలప్మెంట్ పై దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నారు.అందులో భాగంగానే ఖమ్మం జిల్లా, సత్తుపల్లి కనిగిరి కొండల్లో ఎకో టూరిజం అభివృద్ధి కోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లుగా తెలిపారు..

**బ్యాంబు డిపోల ఆదాయం తగ్గింది..**

బ్యాంబు డిపోల నుంచి వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గిందని సునీత ఎం భగవత్ తెలిపారు. దానివల్ల కార్పొరేషన్ కు ఎలాంటి నష్టం ఉండదన్నారు. పొరపాట్లు ఏమైనా జరిగాయా, డిమాండ్ తగ్గటానికి కారణం ఏమిటి, సత్తుపల్లి వంటి డిపోల్లో కొంత బ్యాంబు చెడపట్టటానికి గల కారణాలు, ఎంత మెర నష్టం వాటిల్లింది. బ్యాంబు కటింగ్,డిపోలకు తరలింపు, స్టాక్ పెట్టే సమయంలో ఎలాంటి జాగ్రతలు తీసుకున్నారు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకుంటా మన్నారు. చెద పట్టడం మూలంగా ఫారెస్ట్ కార్పొరేషన్ కు నష్టాలు వస్తున్నాయని వస్తున్న వార్తలను గమనించామని, వాటిపై విచారణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ డివి రెడ్డి, సత్తుపల్లి డివిజన్ మేనేజర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం బదిలీలతో కూడిన పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఆళ్లపల్లి మండలంలో టిపిటిఎఫ్ ఆళ్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపెయిన్‌లో వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, పాఠశాలల, విద్యార్థుల సమస్యలను సేకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను వెంటనే అప్గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలని, కేజీబీవీలలో పని చేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇచ్చి రెగ్యులర్ చేయాలని, వారి పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న సిఆర్టిలను వెంటనే రెగ్యులర్ చేయాలని, వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. ఐటిడిఏ భద్రాచలం పరిధిలోని ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్లకు సంబంధించిన ఆర్డర్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు వీరన్న, సోమ్లా, భావ్‌సింగ్, నెహ్రూ , రవి, సాంబ శివరావు, రామయ్య, శ్రీను, కుమార్ రాజా, రమేష్, చిన్న పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు ఉస్మాన్‌ఖాన్‌కు జీవన సాఫల్య పురస్కారం



ప్రజాపక్షం/ములకలపల్లి: ప్రముఖ కాలమిస్టు, కవి, రచయిత, అనువాదకులు యండి ఉస్మాన్ ఖాన్‌కు ప్రతిష్టాత్మక గిడుగు వెంకట రామమూర్తి జీవన సాఫల్య జాతీయ సాహితీ సేవా పురస్కారం 2025 ప్రకటించారు. ఈనెల 20వ తేదీన హిందూపురంలోని సెవెన్ స్టార్ ఫంక్షన్ హాల్‌లో భారత సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి గోపాల గౌడ చేతుల మీదుగా ఉస్మాన్ ఖాన్‌కు ఈ అవార్డును అందజేయనున్నారు. తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న గిడుగు వెంకట రామమూర్తి స్మరణలో ప్రతి సంవత్సరం ఈ అవార్డు అందజేస్తుంటారు. యండి ఉస్మాన్ ఖాన్ తన రచనల ద్వారా తెలుగు, ఉర్దూ భాషలో అనేక సామాజిక సమస్యలపై రచనలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉస్మాన్ ఖాన్ గత మూడున్నర దశాబ్దాలుగా తెలుగు, ఉర్దూ భాషల్లో సాహిత్యరంగానికి సేవలందిస్తున్నారు. భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, సత్యసాయి రచయితల సంఘం, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. ఈకార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. భారత సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి గోపాల గౌడ, ప్రముఖ గజల్ దిగ్గజం గజల్ శ్రీనివాస్, ఆచార్య రవిశంకర్ గురూజీ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మెళవాయి గోవిందరెడ్డి, విశ్వవిజ్ఞాన విద్యాపీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా తదితరులు పాల్గొంటారు. జస్టిస్ గోపాల గౌడ చేతుల మీదుగా ఉస్మాన్ ఖాన్‌కు అవార్డు ప్రధానం జరగనుందని నిర్వహకులు తెలిపారు. పలువురు అభినందనలు తెలిపారు. జిల్లాకే గర్వకారణమని ప్రశంసించారు.

## సిఎంపిఎఫ్ పాస్ పుస్తకాల పంపిణీ



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : సింగరేణిలో పనిచేస్తున్న ఫారెస్ట్ విభాగం పరిధిలోని గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి మేరకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను అప్డేట్ చేసి, పంపిణీ చేసేందుకు కృషి చేసిన సీఎంపిఎఫ్ అధికారులకు, ఫారెస్ట్ విభాగం అధికారులకు ఏఐటీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ లోని చిల్డ్రన్ పార్క్ వద్ద ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యూ కిష్టాపర్ ల సమక్షంలో గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో వారు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాల నుండి సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలు అప్డేట్ కాకుండా పెండింగ్ లో ఉన్న సమస్యపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలు మార్లు సీఎంపిఎఫ్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. అందులో భాగంగానే సీఎం పిఎఫ్ అధికారులు సింగరేణి ఫారెస్ట్ అధికారులు సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలను అప్డేట్ చేసినట్లుగా తెలిపారు. భవిష్యత్తులో ఆన్లైన్ ద్వారా సీఎంపిఎఫ్ సమాచారం పూర్తిస్థాయిలో అందరికీ అందుబాటులో ఉండేటట్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సూపర్వైజర్ రాము, నాయకులు శివ, ప్రమీల, స్వరూప, లక్ష్మి, భాగ్య, కిరణ్, పార్వతి, వెంకటేశ్వర్లు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రం ఏర్పాటు



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు వాసవి నగర్ గిరిజన భవన్ లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆధార్ కేంద్రం 15, 16, 17 రోజుల్లో నిర్వహించబడును. ఆధార్ కార్డు అప్డేట్ , తప్పొప్పుల సవరణ, పేరు మార్పు కోసం అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, మండల ప్రజలు వినియోగించుకోవాలని మణుగూరు తహశీల్దార్ నరేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు కోరారు.

# ప్రమాదాలకు నిలయంగా పల్లిపాడు చౌరస్తా

-ట్రాఫిక్ సమస్యకు అంతరాయం కలిగిస్తున్న ఆటోలు
-ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టకపోవడ వల్లే తరచుగా ప్రమాదాలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని కొణిజర్ల మండలం పల్లిపాడు వద్ద చౌరస్తా అతి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఎలాంటి ప్రమాదం జరిగిద్దో అని ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. నాలుగు రోడ్ల కూడలిలో నిత్యం వాహనాల రద్దీ ప్రజల రాకపోకలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడ ఎలాంటి ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ముఖ్యంగా ఆటోల నిర్వాహకులు ప్రధాన కూడలిలో ఆటోలు ఆపడం ట్రాఫిక్‌కి పెద్ద సమస్యగా మారింది. అక్కడ పెట్టిన ఆటోలు ఆటో నిండేంత వరకు రోడ్డుపైనే ఉంచడంతో మూడు ప్రక్కల నుంచి వచ్చే వాహనాలు పోవడానికి ఇబ్బందికరంగా కూడా ఒక కారణమని చెప్పవచ్చును. పల్లిపాడు సెంటర్ వద్ద ఎన్నో యాక్సిడెంట్లు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు తీవ్రంగా గాయపడిన సందర్భాలు లేకపోలేదు. ముఖ్యంగా ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్లే వాహనాలు లాలాపురం మీదుగా ఏన్కూరుకు వెళ్లడం, ఖమ్మం నుండి సత్తుపల్లి వెళ్లే వాహనాలు డైరెక్ట్‌గా వెళ్లడం, పల్లిపాడు ఊర్లోకి పోయే రోడ్డు ఇలా నాలుగు రోడ్ల కూడలి ఇక్కడ ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరిగిద్దోనని ఆందోళన చెందుతున్నారు. వాహనాల రద్దీ విపరీతంగా పెరగడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా పెరిగింది. ఈ ప్రధాన కూడలిలో కనీసం ఎలాంటి ప్రమాదాల నివారణ సూచికలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇటు పోలీస్ ఆర్ అండ్‌బి అధికారులు ఇక్కడ ప్రమాదాలు తరచుగా జరుగుతున్న అధికారులు ఇక్కడ ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించకపోవడం పట్ల ప్రజలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు జోక్యం చేసుకొని పల్లిపాడు సెంటర్ వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, అదేవిధంగా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆటోలు ఇష్టానుసారంగా రోడ్డుపై ఆపకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుకుంటున్నారు.

# ఎమ్మెల్యేకు సమస్యలపై విన్నవించిన సిపిఐ



**ప్రజాపక్షం/కల్లూరు:** స్థానిక ఎమ్మెల్యే మట్టారాగమయి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం కల్లూరులోని రైతు వేదికలో జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు. స్త్రీ శక్తి భవనంలో మరుగుదొడ్ల నిర్మాణానికి గ్రామ సమైక్యల నుంచి రూ. 36,000 వసూలు చేసి మండల సమైక్యలో ఏపిఎం బీరవెల్లి రాంబాబు జమ చేపించారు. కానీ ఏడు నెలలైనా మరుగుదొడ్డి నిర్మాణానికి నోచుకోలేదని, మరుగుదొడ్డి లేక గ్రామ సమైక్య మండల సమైక్యలు మీటింగ్ శిక్షణలు సమయంలో ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయమై నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏపిఎం రాంబాబు పై ఎమ్మెల్యే కు దామాల దయాకర్ రావు, వేము రాంబాబులు ఫిర్యాదు చేయగా ఆయనపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఐకెపి మండల సమైక్య సమావేశాలు శిక్షణ సమావేశాలు సమయాన్ని తగ్గించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు ఈ విషయమై సమయాన్ని తగ్గించి మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఏపీఎంకు ఆదేశించారు. అదేవిధంగా గురుకులంలో కోతుల బెడదను తగ్గించేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు ఉదయం, సాయంత్రం మధిర డిపో బస్సులు రప్పించాలని కళాశాల,స్కూలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలపడంతో సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రాత్రి వేళలో వైద్యులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రైవేటు పాఠశాల బస్సులలో స్థాయిని మించి అదనంగా ఎక్కించి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే కు తెలిపారు. ఈ విషయమై ఎంఈఓ సమస్య ను పరిష్కరించాలని ఎంఈఓ కు ఆదేశించారు. సమస్యలపై ఎమ్మెల్యే స్పందించి అధికారులకు తగు చర్యల నిమిత్తం ఆదేశించారు.

# ప్రాంగణ నియామకాల్లో ఎస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రాంగణ నియామకాల్లో 41 మంది ఎస్‌బిఐటి విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ప్రముఖ సంస్థ టెక్ స్కై తమ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ విద్యార్థులు అసమాన ప్రతిభను కనబర్చి 41 మంది ఐటి రిక్రుటర్స్, బెంచ్ సేల్స్ రిక్రూటర్స్‌గా ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా గుండాల కృష్ణ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ దేశాలకు మేధావులను అందించే కర్మాగారమన్నారు. అమెరికా వంటి దేశాలకు నిపుణులను ఎగుమతి చేయడంలో తమ వంతుగా కృషి చేస్తున్న టెక్ స్కై సంస్థలో తమ విద్యార్థులు వారధిగా నిలవడం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. కరస్పాండెంట్ డా|| జి. ధాత్రి మాట్లాడుతూ వివిధ దశల్లో నిర్వహించిన పరీక్షల్లో కమ్యూనికేషన్ టెస్టులో 64 మంది ఎంపికయ్యారని, చివర హెచ్‌ఆర్ రౌండ్‌లో 41 మంది అర్హత సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులకు మూడునెలల పాటు శిక్షణలో భాగంగా రూ. 2.20 లక్షలు అందుకుంటారని అనంతరం మూడు లక్షలు పైగా వార్షికాదాయం పొందుతారన్నారు. ఎంపికైన వారిలో తొమ్మిది మంది ఎంబిఏ విద్యార్థులు, 32 మంది బిటెక్ విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మం ఐటి హబ్‌లో గత కొన్ని సంవత్సరాలుగా నడపబడుతున్న టెక్ స్కై సంస్థలో తమ విద్యార్థులు ఎంపిక కావడం, హైదరాబాద్‌కు పోటీగా ఎదుగుతున్న ఖమ్మంలో తమ కళాశాల విద్యార్థులు ప్రత్యేక స్థానాన్ని సాధించడం హర్షణీయమన్నారు. ఎంపికైన విద్యార్థులు ఎంఎన్‌సి సంస్థలకు దీటుగా సేవలను అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టెక్ స్కై సీనియర్ హెచ్‌ఆర్ ఎస్. రవితేజ, హెచ్‌ఆర్ ఎన్. దుర్గాప్రసాద్, ఇమిగ్రేషన్ స్పెషలిస్ట్ టి. నరేష్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం చోరీ




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని బూడిదంపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలోల్లికి వెళితే... గ్రామానికి చెందిన ఎస్‌కె చాంద్‌పాషా ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. బస్టాండ్ సెంటర్‌లోనే షాపు నిర్వహిస్తూ నివాసిస్తున్నాడు. రోజులాగే ఈ నెల 13న ఆదివారం రాత్రి ఇంటి ముందు వరండాలో ద్విచక్ర వాహనం టిఎస్ 04ఈవై 1455 నెంబరు గల యూనిక్రాన్ వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి ద్విచక్ర వాహనం లేకపోవడంతో చుట్టు పక్కల వెతకడంతో పాటు స్నేహితులను, ఇంటి పక్కల వారిని అడిగినా ఎవరు చూడలేదని చెప్పారు. ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి, గంగారంమత్స్యశాఖ సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘంలో ఇటీవల కాలంలో మృతి చెందిన పలు కుటుంబాలు రూ.9 వేల ఆర్థిక సాయం చొప్పున 6 మందికి రూ. 54 వేలు ఆర్థిక సాయంగా సోమవారం అందజేశారు. సహకార సంఘం సభ్యులను సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, మాజీ వైస్ ఎంపిపి దాసరి వెంకటరామిరెడ్డి రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు దాసరి మధు మోహన్ రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సొసైటీ అధ్యక్షులు వూకే కన్నారావు, కాకా రామచంద్రరావు, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ వూకే చలమారావు, మాజీ డైరెక్టర్ సోయం కోటేశ్వరరావు, సోయం వెంకటేశ్వరరావు, సవలం నాగరాజు, వూకే విజయరావు, వూకే.వినయ్, పొట్ట శ్రీను, వూకే సింగరాజు, వూకే సత్యనారాయణ, వాడే మల్లేశ్వరరావు, వాడే రాజా, సోరెం మహేశ్వరరావు, సోయం గోవిందరావు, వూకే శివకృష్ణ, కావేటి అప్పారావు, పాలెపు శ్రీను, వూకే రమేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుల సమ్మె సైరన్




**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి కార్మికులు సోమవారం నుంచి వేతనాలు కొరకు సమ్మె సైరన్ మోగించారు. కల్లూరు లోని హెల్త్ కమ్యూనిటీ ఆసుపత్రిలో గత మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు దీంతో నాలుగవ నెల గడుస్తున్న వేతనాలు కార్మికులకు అందకపోవటంతో కార్మికుల అవస్థలు పడుతున్నట్లు, దీనివల్ల సోమవారం నుంచి వేతనాలు పడే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రోజువారి నిరసన కార్యక్రమాలు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. చాలీచాలని వేతనాలతో రేక్కాడితే డొక్కాడని కుటుంబాల వారు జీవనం సాగక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వారికి వెంటనే వేతనాలు మంజూరు చేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు ప్రభుత్వ ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మధు కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు దయాకర్ రావు, లతోపాటు కార్మికులు పేషంట్ కేర్ ,స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు, వంశి నాగమణి ,కోటేశ్వరి, రంజాన్ బి, లక్ష్మీ ప్రసన్న, మేరీ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి రిమాండ్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** భార్యను హత్యచేసిన కేసులో నిందితుడిని కొణిజర్ల పోలీసులు సోమవారం రిమాండ్ చేశారు. వైరా ఏసిపి రహెన్. సిఐ సాగర్, కొణిజర్ల ఎస్సై సూరజ్ తోకలిసి పత్రికా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కామేపల్లి మండలం చెందిన భూక్యా మదన్ ఏన్కూరు మండలానికి చెందిన మహిళను వివాహంచేసుకొని పిల్లలు పుట్టడంలేదన్న కారణంతో పెళ్లయిన నాలుగేళ్లకే ఆమెకు విడాకులు ఇచ్చాడు. తండాకు చెందిన భర్తను వదిలేసి ఇద్దరు పిల్లలున్న భూక్యా హాస్లీ(40) తో పరిచయం పెంచుకొని ఆమెను తీసుకొని కొణిజర్ల మండలం విక్రమ్‌నగర్ బంధువుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆరు సంవత్సరాలుగా ఆమెతో సహజీవనం కొనసాగిస్తున్నాడు. ఈమెకు కూడా పిల్లలు పుట్టకపోవడంతో మరో మూగమ్మాయిని పెండ్లిచేసుకొని ముగ్గురు ఒకే ఇంట్లో కాపురం చేస్తున్నారు. మూగమ్మాయికి సహజావనం చేస్తున్న హాస్లీకి తరచు గొడవలు పడుతుండటంతో ఇద్దరిలో ఒకరిని హతమార్చాలని పథకం వేశాడు. దీంతో ఆమెను మట్టుబెట్టేందుకు కొణిజర్లకు చెందిన తమ్మిశెట్టి నరసింహారావు,చల్లా నాగేశ్వరరావులతో లక్ష రూపాయలకు ఒప్పందం చేసుకున్నాడు. ఈక్రమంలోనే సహజీవనం చేస్తున్న హాస్లీతో నీకు మూగమ్మాయికి పడటంలేదుగదా ఆమెను ఏదోఒకటి చేద్దామని నమ్మించి ముందుగానే ప్లాన్ చేసుకున్న ప్రకారం ఆటోమాట్లాడుకొని ఆమెను ఆటోలో ఎక్కించుకొని సూర్యపేట జిల్లా చింతలపాలెం పోలీస్‌స్టేషన్ పరిదిలో కిష్టాపురం గ్రామ సమీపంలో అడివిలోకి తీసుకెళ్లారు. ఆమెకు విషం ఇచ్చి గొంతునులిమి చంపేశారని తెలిపారు. మృతురాలి కూతురు మృతురాలికి రోజు ఫోన్‌లో మాట్లాడుతుంది. వారం రోజులునుంచి ఫోన్ మాట్లాడకపోవడంతో కూతురుకు అనుమానం వచ్చి విక్రమ్‌నగర్ వెళ్లి మదన్ తల్లిగురించి అడగగా అతను సరిగ్గా స్పందించకపోవడంతో 11వ రోజు కొణిజర్ల పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు మదన్‌న్ విచారించగా పోలీసు విచారణలో నేరం ఒప్పుకున్నాడు. ఆమెను చంపిన ప్రదేశానికి చేరుకొని మృతదేహం వద్ద పంచనామా చేసి మృతదేహానికి ఆమె కుటుంబసభ్యులకు అప్పగించాడని తెలిపారు. 24 గంటల్లో కేసును చేధించిన కొణిజర్ల ఎస్సై జి సూరజ్‌ను ఏసిపి అభినందించారు.

# పాము కాటుకు వివాహిత మృతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ముత్తగూడెం గ్రామంలో విషాదం నెలకొంది. పాము కాటుకి ఓ వివాహిత మహిళ మృతి చెందిన ఘటన పెనుపల్లి మండలంలో చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన గరిడి నాగేశ్వరరావు భార్య విజయలక్ష్మి (35) పాము కాటుతో మృతి చెందింది. సోమవారం తెల్లవారు జామున నిద్ర లేచి ఇల్లు ఉడుస్తుండగా మెస్ గేటు వద్ద ఉన్న పాము ఆమె పాదం బొటన వేలిని కరవడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా ఆసుపత్రికి చేరుకున్నలోపే మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ముత్తగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మేక పాలు ఎంతో శ్రేష్ఠకరం : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆవు, గేదె పాలకంటే మేక పాలే ఎంతో శ్రేష్టమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ఫుడ్ కోర్టులో మహిళాశక్తి క్యాంటీన్‌లే మేకపాల విక్రయాల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా శక్తి క్యాంటిన్ సభ్యులతో ముచ్చటించి విక్రయాల వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్‌కు మహిళాశక్తి మేక పాల కేంద్రం వారు ఇచ్చిన మేకపాలను ఆయన సేవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా మేకపాలు త్రాగించాలని, ఇవి ఎంతో శ్రేష్టమైనవన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల మేకలున్నాయని, ప్రస్తుతం మార్కెట్లో ఆవు, గేదె పాలు లీటర్ ధర రూ.80 ఉందని, అదే ధరకు మేకపాలు కూడా విక్రయించవచ్చన్నారు. జిల్లాలో రైతులు ముందడుగు వేసి లీటర్ నుండ ప్రారంభించిప్పటికీ రైతులకు రూ.3వేల నుండి రూ.4 వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. మేకపాల విక్రయాల ద్వారా జిలాల్లో ఏటా రూ.50 కోట్ల వ్యాపారం సాగుతుందని, జిల్లాలో మేకల పెంపకానికి, పశుగ్రాసానికి అనువైన వాతావరణం ఉందన్నారు. నగరాల్లో మేకపాలతో పన్నీరు, చీజ్ వంటివి తయారు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని, మన ప్రాంతంలో కూడా వీటిని వినియోగించడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. రైతులు ఈ దిశగా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డా.వెంకటేశ్వర్లు, డా.అనందరావు, బాలకృష్ణ, రామకృష్ణ, సంతోష్, గోపాలమిత్ర సత్యనారాయణ, మహిళాశక్తి క్యాంటిన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి : ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని గిరిజన గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఐటిడిఏ పిఓ రాహుల్ వినతులు స్వీకరించారు. గిరిజనుల సమస్యలు పరిష్కారం కోసం అందించిన దరఖాస్తులను క్షుణ్ణగా పరిశీలంచిన ఆయన ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం పిఓ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, ఏ కారణం చేతైనా సమస్యలు పరిష్కరించడానికి వీలుకాకుంటే వెంటనే దానికి సంబంధించి ఫైల్ సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఐ భాస్కర్‌తో పాటు ఇతర అధికారులు భాస్కర్, ఉదయ్, రాంబాబు, లక్ష్మీ నారాయణ, వేణు, అనసూయ, ఆదినారాయణ, హరికృష్ణ, ప్రమీలాబాయ్, నర్సింహారావు, మోహన్, భార్గవ్, వెంకటేశ్వర్లు, ముత్తయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ల్యాప్రోస్కోపిక్ సర్జరీ విజయవంతం కావడం అభినందనీయం

**- వైద్యులను షాలువాతో సత్కరించిన ఐటిడిఏ పిఓ**



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఓ మహిళకు ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సను విజయవంతంగా చేయడం అభినందనీయమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్యుల బృంధాన్ని ఐటిడిఏలోని తన ఛాంబర్లోకి పిలిచి షాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన మల్లా రమణ అనే మహిళకు పిత్తాశయంలో రాళ్లు ఉండటంతో ఖరీదైన ఆపరేషన్ ప్రైవేటు వైద్యశాలలో చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణను రోగి కుటుంబీలు కలిశారని చెప్పారు. ఆమెను పరీక్షించిన వైద్యులు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో విజయవంతంగా వైద్యుల బృంధం శస్త్రచికిత్స నిర్వహించారన్నారు. ఏజెన్సీ ప్రాతంలోనిప్రజలు సరైన అవగాహన లేక ఇలాంటి రోగాల భారిన పడుతున్నారని, వైద్య సిబ్బంది వారిని గుర్తించి సేవలు అందించాలన్నారు. వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయని, వైద్యులు 24 గం.పాటు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు. గోదావరి వరదలు కూడా పెరిగే అవకాశం ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గోదావరి పరివాహక, అటవీ ప్రాంతాల్లో గర్భిణీలు ఉంటే అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమాచారాన్ని తెప్పించుకుని వారిని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిఎంహెచ్ఓ డా.చైతన్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెంటెంట్ డా.రామకృష్ణ, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డా. వెంకటరాజ్, డాక్టర్ నికిత తదితరులు పాల్గొన్నారు.

# రేగా కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/భద్రాచలం :** పినపాక మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావును బిఆర్ఎస్ భద్రాచలం పట్టణ నాయకుల ఆకోజ్ సునీల్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా రేగా స్వగ్రామమైన కరకగూడెంకు చేరుకున్న ఆయన రేగా మాతృమూర్తి చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ రేగా మనోధైర్యంగా నిబ్బంరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట యూత్ కార్యదర్శి బద్ది బాబి, రైతు సంఘం నాయకులు అయినాల రామకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెషర్‌బాంబు పేలిపి ముగ్గురు పౌరులకు గాయాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలి ముగ్గురు పౌరులు గాయాలపాలైన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. ఆ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మద్దేడ్ పోలీ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి ధంగోల్ గ్రామస్తులు పుట్టగొడుగుల సేకరణ కోసం సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఈ సమయంలో పోలీసుల కోసం మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ ఐఇడి బాంబు ఒక్క సారిగా పేలడంతో ఒక బాలికతో సహా ముగ్గురు గ్రామస్తులు గాయాలపాలయ్యారు. గాయపడిన వారిలో కడియం కవిత, కోర్సే సంతోష్, చిదెం కన్హయ్యలు ఉన్నారు. వారిని రాత్రిరాత్రే తక్షణ చికిత్సల కోసం బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. గిరిజనులు అడవల్లో సంచరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని పోలీస్ అధికారులు తెలిపారు.

# నేడు బూత్‌లెవల్ అధికారుల శిక్షణ

**ప్రజాపక్షం/భద్రాచలం :** మండల పరిధిలోని బూత్ లెవల్ అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అధికారి దామోదర్ రావు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ భారతఎన్నికల సంఘం కమీషనర్ ఆదేశాను సారం మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. భద్రాచలం మండల పరిధిలోని బూత్‌లెవల్ అధికారులంతా ఈ శిక్షణా కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

# ఆత్మీయ భరోసాకు ఈజీఎస్‌తో లింక్ వద్దు




**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చే ఇందిర ఆత్మీయ భరోసాకు ఈజీఎస్ పనితో సంబంధం పెట్టవద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కారేపల్లి భరత్ నగర్ కాలనీలో వ్యవసాయ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా భూమిలేని పేదలందరికీ రూ 12వేలు అందించాలన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారుల ఎంపిక జరిగిందని, వారి పేర్లను గోప్యంగా ఉంచటంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ 2500 అమలుకు నోచుకోవటం లేదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఉపాధి పని దినాలు 200 రోజు కల్పిస్తూ రోజు కూలి రూ 600 చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యకాస నాయకులు ఇల్లంగి పిచ్చయ్య, పాసిన్ని నాగేశ్వరరావు, ముఠామేస్త్రీ తొగర ఉప్పమ్మ, సోమందుల నిర్మల, కోపుల సుజాత, రాయల రాంబాబు, తొగరు సుజాత, తొగరు రోశమ్మ, అనంతగిరి హైమ, తులసి మొగ్గ శ్రీరాములు, బేతమల్ల ఎల్లయ్య, కృష్ణ, సాంబ, జనార్ధన్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి నాగారం పాఠశాలలో కొల్లి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు సోమవారం నోట్‌బుక్స్ పంపిణి చేశారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి మాట్లాడుతూ,విద్యతోనే ఉజ్వలమైన భవిష్యత్‌ను పొందుతారని తెలిపారు. చదువును ఇష్టపడుతూ కష్టపడి చదవాలన్నారు. మీపై నమ్మకంతో ఉన్న తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాజులు, పద్మావతి, స్వాతి, ఏఏపిసి విఓ చైర్మన్ సత్యవతి, డి. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలోవచ్చిన ప్రతి దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో సుదూర ప్రాంతాల నుండి ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి ఇక్కడిదాకా వచ్చి వినతులు అందిస్తుంటారని, అలాంటి క్రమంలో వారి నమ్మకాన్ని ఒమ్ము చేయరాదన్నారు. పరిష్కారానికి నోచుకోనివాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ ఉద్యోగాలకు ధరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ఆదేశాలతో పాల్వంచ ( కొత్తగూడెం )ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో ప్రొఫెసర్ 10, అసోసియేట్ ప్రొఫెసర్ 36, అసిస్టెంట్ ప్రొఫెసర్ 18, సీనియర్ రెసిడెంట్ 37ఉద్యోగాలకు అర్హుల నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ రాజ్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ ధరఖాస్తులతో హాజరై ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూలో పాల్గొనాలని సూచించారు.

# ప్రకృతి పరిరక్షణకు విద్యార్థుల భాగస్వామ్యం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రకృతి పరిరక్షణలో భాగంగా రామవరం పాఠశాల విద్యార్థులు ఆ సమీప అడవిలో విత్తనాలు చల్లారు. ప్రకృతిపరిరక్షణలో విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలని సంకల్పంతో ఇటీవల జిల్లాకలెక్టర్ జిల్లా వ్యాప్తంగావిత్తనాలు సేకరణపై ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆచరణాత్మకంగా తసుకుంటూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన విత్తనాలు నేడు గరీబ్‌పేట్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో చల్లారు. విద్యార్థులు స్థానికంగా సేకరించిన టేకరించిన, చింత, గానుగ, వేప, పనస విత్తనాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి వాటిని అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా పునరావసం చేయాలనే దృష్టితో విత్తనాలను చల్లారు. వర్షాకాలం ఇందుకు అనువైనది కావడంతో అటవీ శాఖ సహకారంతో అనువైన ప్రదేశాల్లో చల్లించారు. కలెక్టర్ ఆదేశాను సారంగా మొదట్నుంచి రామవరం పాఠశాల ప్రధానోపధ్యాయులు డా.ప్రభుదయాళ్ విద్యార్థులను ప్రోత్సాహంచారు. ఈ కార్యక్రమంలో నరేష్‌బాబు, శంకర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తగదు : తెల్లం



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ పథంలో పనులు పూర్తి చేసుకుంటున్న అభ్దిదారులు బిల్లులు చెల్లింపుల్లో అధికార్లు జాప్యం తగదని ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు అన్నారు.. సోమవారం మండల పరిధిలోని కమలాపురం, ఎర్రబోరు గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్బంగా ఇటీవల మంజూరైన మొదటి విడుత ఇందిరమ్మగృహాలు లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు.లబ్ధిదారులు ఆయన దృష్టికి పనులు పూర్తి చేస్తున్నప్పటికి బిల్లు విడుదల కావండం లేదని సమస్యను ఆయన దృష్టి తీసుకు వెల్లారు. ఈ విషయంపై స్వందించి హౌజింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. బిల్లులు విషయయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధికార్లు , మండల కాంగ్రేస్ నాయకులు , యూత్ కాంగ్రేస్ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

# వన మహోత్సవానికి పటిష్ట ప్రణాళిక

**-గురుకులాల్లో శుచి, శుభ్రత పాటించాలి**
**-రెవెన్యూ, అటవీ భూముల సమస్యను సమన్వయంతో పరిష్కరించాలి**
**-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వన మహోత్సవ విజయవంతానికి పటిష్ట ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి రెవెన్యూ, అటవీ భూములు, వన మహోత్సవం, ప్రభుత్వ గురుకులాల్లో శుచి, శుభ్రతపై అధికారులతో సోమవారం సమీక్షించారు. జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలాల వారీగా 10 ఎకరాలకు తక్కువ కాకుండా బ్లాకుల గుర్తింపు చేయాలన్నారు. అటవీయేతర భూముల్లో మియావాకీ తరహాలో మొక్కలు నాటి ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. స్థలాలు గుర్తింపు చేసి, పిట్టింగ్, ప్లాంటింగ్‌కు ప్రణాళిక చేయాలన్నారు. జులై ఆఖరి వారంలోగా బ్లాకుల్లో ప్లాంటింగ్ పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌కు కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా పచ్చదనం పెంపొందించాలన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో ఒక్క చోట ఫుడ్ పాయిజన్ అనే మాట రాకూడదని ఆ దిశగా సబంధిత ఆర్‌సివోలు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం గురుకులాల్లో పిల్లలకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తుందన్నారు. శుచి, శుభ్రమైన ఆహారాన్ని పిల్లలకు అందేలా చూడాలన్నారు. తహసీల్దార్ వారి పరిధిలోని ప్రభుత్వ గురుకులాల సందర్శన వారానికి ఒక్కసారైనా చేపట్టాలన్నారు. కిచెన్, పరిసరాలు, వంటలు ఎలా జరుగుతున్నాయి తనిఖీలు చేసి పిల్లలతో కలిసి భోజనం చేయాలన్నారు. పిల్లలకు, సిబ్బందికి శుచి, శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. టెస్ట్ కమిటీ, ఫుడ్ కమిటీ, హైజిన్ కమిటీ, హెల్త్ కమిటీ, స్టూడెంట్ కమిటీలు క్రియాశీలకంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రభుత్వ భూములు, అసైన్డ్, అటవీ భూముల పరిస్థితిపై అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ, రెవెన్యూ భూముల వివాదాలు జాయింట్ సర్వేతో ఇరుశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మశ్రీ, ఆర్డివో జి. నర్సింహారావు, రాజేందర్ గౌడ్, వివిధ శాఖల ఆర్‌సివోలు, అదనపు డిఆర్‌డివో శిరీష, ఫారెస్ట్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల బకాయిలను చెల్లించండి

**-మంత్రులకు ఎస్‌జిపిఏటి వినతి**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరం చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మంత్రులకు విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ ఏడాది కాలంగా ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించడం లేదని గ్రాట్యూటీ, కమ్యూటేషన్, జిపిఎఫ్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొందరు బకాయిలు అందుకోకుండానే తనువు చాలించారని వారు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాల తరబడి ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా ఈ సమాజానికి సేవలు అందించిన వారి పట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంభించడం తగదని తక్షణం బకాయిలు వారి ఖాతాల్లో జమ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రులను కలిసి వినతి పత్రాలు అందించిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, నాయకులు భాస్కరాచారి, వీరభద్రరావు, మేరీ ఏసుపాదం, అన్నమ్మ, రాజ్యలక్ష్మి, శాంతయ్య, ప్రసాదరావు, నాగప్రసాద్, మధుకర్‌రెడ్డి, పుల్లయ్య, అప్పయ్య, మట్టూరి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# వైరాలో భారీగా పించన్ల మాయాజాలం

**-చనిపోయినా ఆగని పింఛన్లు.. బియ్యం సరఫరా**
**-విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి..**






**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ వైరా మండలంలో గత కొన్ని సంవత్సరాల క్రితం మరణించిన వారి పేరు మీద ప్రతి నెల ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌ను వారి కుటుంబ సభ్యులు చనిపోయిన వారి ఏటిఎం కార్డు ద్వారా డ్రా చేస్తున్నారు. ప్రజా పంపిణీ బియ్యం మరణించిన వారి పేరు మీద తీసుకొని పోతున్నారు. మరణించిన వారికి పింఛన్‌కి సంబంధించి వారి కుటుంబ సభ్యులు పింఛన్ డబ్బులు పడే బ్యాంకు ఏటిఎంను వారి వద్ద ఉంచుకొని ప్రతి నెల వస్తున్న పింఛన్ ఎవరికి తెలియకుండా ఏటిఎం ద్వారా డ్రా చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులు కూడా తల్లిదండ్రులు వృద్ధాప్యంలో చనిపోతే వారి వివరాలను సంబంధిత మున్సిపాలిటీలో కాని మండల పరిషత్ కార్యాలయంలో గాని సెక్రటరీకి అందించకుండా వారి పేరు మీద వచ్చే పింఛన్‌ను తీసుకుంటున్నారు. అదేవిధంగా రేషన్‌కార్డుల్లో చనిపోయిన వారి పేరును తొలగించుకోకుండా వారి పేరు మీద ప్రతి నెల రేషన్ తీసుకుంటున్న సందర్భాలు వైరాలో కనబడుతున్నాయి. వివిధ హోదాల్లో ఉద్యోగం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు చనిపోయిన వారి పింఛన్ డబ్బులు కాజేయడంలో కీలకపాత్ర వహిస్తున్నారు.అ లాంటి వారిపై అధికార యంత్రాంగం వెంటనే గుర్తించి వారి మీద చర్యలు చేపట్టి చనిపోయిన అప్పటి నుండి తీసుకున్న ప్రభుత్వ పింఛన్ డబ్బులు, ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని రికవరీ చేసుకోవాలని పలువురు ఆరోపిస్తున్నారు. ఎందుకంటే చనిపోయిన వారి వివరాలను గోప్యంగా అధికారులకు వివరించకుండా వారి సమాచారాన్ని డిలీట్ చేపించకుండా ప్రభుత్వాన్ని మోసం చేయడం చట్టరీత్యా నేరం, అలాంటి వారిపై సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో, చనిపోయిన వారి పేరు మీద తీసుకుంటున్న పింఛన్లు రేషన్ బియ్యంను ఏ విధంగా రికవరీ చేస్తారో, కేసులు పెడతారా, వారిని వదిలేస్తారా అనే దానిపై అధికారులు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూడాల్సిందే.

# కల్లూరు అప్పయ్య సంక్రాంతి, చిత్రాలకు అంతర్జాతీయ అవార్డుల పంట



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సినీ రచయిత, దర్శకుడు కొత్తపల్లి శేషు రచన, దర్శకత్వం వహించిన కల్లూరు అప్పయ్య సంక్రాంతి 2025 చిత్రాలకు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ స్థాయి అవార్డు లభించాయి. కల్లూరు అప్పయ్య సంక్రాంతి 2025 ఈ రెండు చిత్రాలకు ఇంటర్నేషనల్ మలేషియా సినీ అవార్డ్స్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుని, ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డు కొత్తపల్లి శేషుకు ఉత్తమ నిర్మాత అవార్డు ప్రముఖ విద్యావేత్త, మీడియా అధినేత శ్రీధర్‌బాబుకు ఉత్తమ నటుడు అవార్డు ప్రముఖ యాంకర్, నటుడు మొగిలి గుణకర్ ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నల్లగట్ల కిషోర్‌బాబు ఉత్తమ నటి అవార్డు మహేశ్వరి నాయుడు, యామినిలకు ప్రకటించారు. త్వరలో సినీ ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డులను విజేతలకు అందించనున్నట్లు మలేషియా ఇంటర్నేషనల్ అవార్డు కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా అవార్డు పొందిన వారిని, కో డైరెక్టర్ రవితోప్, కెమెరామెన్ ఉదయ్‌కుమార్, చందులను ఖమ్మం నగరానికి చెందిన పలువురు కళాకారులు, అభిమానులు, పుర ప్రముఖులు అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు రావడానికి తమ టీం వర్క్ కారణమని నిర్మాణ శ్రీధర్‌బాబు, కొత్తపల్లి శేషు, మొగిలి గుణకర్, రవితోప్, కిషోర్ తదితరులు తెలిపారు. త్వరలో ఓ పెద్ద సినిమా నిర్మాణానికి ప్రణాళికలు చేస్తున్నామని వారు తెలిపారు. అవార్డు ప్రకటించినందుకు అవార్డుల కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

# హోంగార్డ్ రఘుపతి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన హోంగార్డ్ రఘుపతి ఇటీవల మృతి చెందాడు. రఘుపతి కుటుంబానికి తోటి హోంగార్డులు సోమవారం రూ. 46వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తోటి స్నేహితుడు అకాల మృతిచెందడం దురదృష్టకరమన్నారు. రఘుపతి కుటుంబానికి అండగా ఉండేందుకు ఈ ఆర్థిక సాయం అందించినట్లు వారు తెలిపారు.

# నానో యూరియా, నానో డిఏపిపై అవగాహన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల కెజి సిరిపురం, తాటిపూడి గ్రామాల్లో సోమవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ నాననో డిఏపి, నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ మాట్లాడుతూ యూరియా బస్తాలకు బదులుగా ఇఫ్కో సహకారంతో నానో యూరియా, నానో డిఏపిని స్ప్రే చేయడం జరిగింది. యూరియా బస్తా , డిఏపి వాడకం వలన భూమి సాంద్రత కోల్పోతుందని, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని దానికి బదులు రైతులు యూరియా డిఏపిని స్ప్రే చేయడం వలన భూ సాంద్రత కోల్పోకుండా కాలుష్య నివారణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు కీర్తి, రాకేష్, ఇఫ్కో డవలప్‌మెంట్ ఆఫీసర్ యరమల మహేందర్‌రెడ్డి, రైతులు బండి గోపాలకృష్ణ, గాలి శ్రీనివాసరావు, మోరంపూడి రాంప్రసాద్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మందాడపు కృష్ణార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# గండగలపాడులో తాగునీటి ఇబ్బందులు

**-పగిలిన పైప్‌లైన్ ... రెండు రోజులుగా తాగునీరు బంద్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలోని 10వ వార్డు గండగలపాడులో నిర్లక్ష్యం వలన మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో గత రెండు రోజులగా త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గండగలపాడులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మాణం చేపడుతున్న క్రమంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌పై గుంట వేయడంతో భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. ఎల్‌అండ్‌టి అధికారులకు సమాచారం అందించగా పైప్‌లైన్ మేము వేస్తాము, జేసిబిని ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ అధికారులు జోక్యం చేసుకొని జేసిబి సహాయంతో గుంటను పూడ్చి త్రాగునీటిని సరఫరాను పునరుద్దరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# గురుదేవ్ విద్యాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్



**ప్రజాపక్షం/చర్ల :** స్థానిక గురుదేవ్ విద్యాలయంలో ఐఎల్ఎం బెంగళూరు వారిచే స్పోకెన్ ఇంగ్లీష్ ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ హెచ్‌జివి ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు సలళమైన ఆంగ్ల భాష ఈ స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు చెబుతున్నామన్నారు. ఇంగ్లీష్ భాషలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందాలనే సదుద్దేశ్యంతో ఎంతో వ్యయంతో కూడినప్పటికీ ఐఎల్ఎం బెంగళూరు వారితో ఒప్పందాన్ని చేసుకుని తరగతులు ప్రారభించామన్నారు. ఇందు కోసం బెంగళూరు నుండి శిక్షణ ఇచ్చేందుకు సౌజన్య,సందీప్‌లు ఇక్కడిదాకా వచ్చారని చెప్పారు. ఏజెన్సీలో విద్యార్థులకు ఆంగ్లభాషపై మంచిపట్టు తెప్పించేందుకు ఇక్కడిదాకా వచ్చిన వారిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.